# అర్థమున్న కథ

1

'నీటిలోని చేపకయినా, గాలిలోని పక్షికయినా స్వేచ్ఛ ఉంటుంది. కాని భూమిమీద పుట్టిన తనలాంటి మనిషికే లేదు స్వేచ్ఛ' అనుకున్నాడు రామచంద్రం.

'ఎందుకు లేదూ? అందుకే యీ ప్రయాణం' అని మళ్ళీ తనే జవాబు చెప్పుకున్నాడు.

రైలు ఏదో స్టేషనులో ఆగింది. అక్కడికి తన ఊరు సరిగ్గా పదిహేను మైళ్లు. ఈ అరగంటా కష్టపడి యింత తక్కువ దూరం వచ్చింది. మనస్సుతో పోలిస్తే దీని వేగమనగా ఎంత? మరుక్షణం రామచంద్రం మనస్సు వాళ్ళ యింట్లో ఉంది. ఈపాటికి పెద్దమ్మలు ఏం చేస్తూ ఉంటుందో ?

ఏం చెయ్యడాని కేముంది? పుట్టి బుద్ధెరిగి వాళ్ళకి తనెప్పుడూ తక్కువ చెయ్యలేదు...యిప్పుడంతకన్నా చేసిందీ లేదు. ఆ నెల అందుకున్న జీతం ఎనభై రూపాయల్లోనూ వెచ్చాల కొట్లో పదిహేను. చాకలికి అయిదూ పూర్తిగా తీర్చేశాడు. ఇంటద్దె పన్నెండూ ఎన్నడూలేంది ఓనెల అడ్వాన్సు కూడా యిచ్చేశాడు. రైలు టిక్కెట్టుకి పదిరూపాయలు పోను తన జేబులో యింకా మూడు పదిరూపాయల నోట్లుకాబోయి ఉన్నాయి.

మరేం ఫరవాలేదు. ఎంత పట్నంలో అయినా వీటితో కనీసం ఓ వారం రోజులు గడపకపోదు. ఈలోగా తనకున్న డిగ్రీకి కనీసం ఓ ఏభై రూపాయల ఉద్యోగమయినా దొరక్కపోదు. ఒక్క మనిషికి ఎంత కావాలి కనక !

ఇదికాక తను పెద్దమ్మలు బొట్టుపెట్టిలో ఎదురుగుండా కనపడేట్టు పెట్టిన పదిరూపాయల కాగితం ఈ పాటికి చూసుకునే ఉంటుంది. వెధవది,

ఒక్కటంటే ఒక్క పదిరూపాయల నోటు ఎన్నాళ్లు వస్తుంది? ప్రశ్నంటూ వేసుకోకూడదుగాని ప్రశ్నకు తిరుగు ప్రశ్నలు కూడా ఉండొచ్చు మరి!

ఒక్కనెల జీతం, ఎనభై రూపాయలు. అదిమాత్రం ఎన్నాళ్ళు వస్తుంది ?

అంతవరకు ఎందుకు, ఒక్క మనిషికి ఒకే ఒక జీవితం పరిమితం. అదిమాత్రం ఎన్నాళ్ళు వస్తుంది ?

స్థిరమూ, స్థిమితమూ లేని ఈ ప్రపంచంలో ఎప్పుడు దేని విలువ ఎంతో ఎవరుమాత్రం చెప్పగలరు ?

అందుకే, ఒకర్ని బాగుచెయ్యలేకపోయి నందుకే, కనీసం తనయినా బాగుపడేందుకే, రామచంద్రం బయలుదేరాడు. ఏం తప్పా ?

కష్టసుఖాలు కావడికుండ లంటారు. కాని తనలాంటి దురదృష్టవంతుడి కావడిలో ఒక పక్క కష్టమూ, ఒక పక్క సుఖమూ లేవు. అన్నిపక్కలా కష్టాలే. ఆ కావడి బరువు ఎంతో తెలుసుకోడానికి తండ్రి ఒకనాడు హఠాత్తుగా కన్ను మూసేదాకా తను కన్ను తెరవలేక పోయాడు. ఆ పైన తను బియ్యే పాసవడానికి తన సర్వశక్తులూ కేంద్రీకరించవలసి వచ్చింది.

మనిషి అన్నవాడికి కష్టసుఖాలు ఉంటాయి, ఉండకపోవు. సంకర్షణుడి కయినా సంసార సంఘర్షణ తప్పలేదు. ఏటికి ఎదురీదడమే జీవితం కావచ్చు. కాని దానికితోడు రెండు గుదిబండలు కూడా ఉంటే ఎలా ? ఆ గుదిబండల పేర్లే పెళ్ళికెదిగిన తన చెల్లెళ్ళు.

ప్రతి చిన్న సంగతికి పెద్దపెద్ద పేచీలు. అతి నీచవిషయాలపై అమిత మైన మోజులు. ఎంతసేపూ పనికిమాలిన సినిమా కబుర్లు. పొద్దున ఏ తొమ్మిదింటికో ఆఫీసుకి పోయి సాయంకాలం ఆరింటికి విశ్రాంతి కోరుతూ యింటికొచ్చే మొగాడికి వీరిచ్చే అశాంతి ఎంతటిదని! ఇంట్లో అదిలేదనీ

ఇదిలేదనీ, లేదు అనే మాటతప్ప ఈ ఆడాళ్ళ దగ్గిర మరొకటి లేదేమో! వీళ్ళ గురించి చెప్పడానికి ఏ ఒక్కరోజు అల్లరి పేర్కొన్నా చాలు.

*    *    *    *

'అబ్బబ్బబ్బ! ఓ గడి ఊరుకోండే బాబూ...చూడండి తల్లీ! నే చెప్పింది కొంచెం వినండి. ఆలోచించి చూస్తే ఏ పనీ లేకుండా ఊరికే కూచోడమే మిమ్మల్ని ఎందుకూ పనికిరాని వాళ్ళనుగా చేస్తోందనుకుంటా. కాస్సేపు ఏదైనా చదువుకోండే అంటే, ఆ డిటెక్టివ్ నవల్సు తప్ప మరొకటి ముట్టుకోరాయె...పోనీ, చూడు చిన్నమ్మలూ! మెయిన్ రోడ్డులో కుట్టుపని సెంటరు ఒకటి 'ఓపెన్' చేశారుట, అక్కడికి వెళ్ళి మీరెందుకు నేర్చుకోకూడదూ?'

'అవునవును, నువ్వు తెచ్చిన జాకెట్టుగుడ్డలూ అవీ ఎక్కువయి పోయాయా; అవి పట్టుకుని ఎన్ని చోట్లకయినా తిరగాలి, ఏమే అక్కా'

'మా రె! అయినా అన్నయ్య ఉద్దేశం అది కాదనుకుంటానే... మనం కుట్టుపని నేర్చుకుని వాళ్ళ దగ్గిరా, వీళ్ళ దగ్గిరా బట్టలడిగి తెచ్చుకుని కూలికి కుట్టి యివ్వాలని కాబోలు!'

'అవు నదే...ఏం తప్పా?'

'అబ్బెబ్బే, ఏ తప్పూలేదు......ఇవాళ కుట్టుపని చెయ్యమంటావ్, రేపెక్కడో వంట మనిషిగా కుదురుకో మంటావు. దిక్కుమాలి నీ కొంప చేరుకోడమే మేము చేసిన తప్పు. మా ముద్దూ ముచ్చటా అమ్మ నాన్నతోనే చచ్చిపోయాయి...నీ తప్పు ఏముందిలే!'

ఇదిగో యిదీ వరస. పోనీ వీళ్ళకి పెళ్ళిళ్లు చేసి తన బాధ్యత తీర్చుకుందామని కూడా రామచంద్రం ప్రయత్నించక పోలేదు.

'పెద్దమ్మలూ, నేను చచ్చిచెడి ఒక సంబంధాన్ని తెస్తే నువ్వు కాదనేస్తే ఎలాగ తల్లీ? మనలాంటి లేనివాళ్ళకి యింతకన్న మంచి సంబంధాలు

ఎలా వస్తాయి ? సెకండరీగ్రేడు ట్రెయినింగయి ఆ అబ్బాయి హాయిగా మేష్టరీ చేసుకుంటున్నాడు. అది ఉద్యోగం కాదంటావా? నిజంగా కాకపోతే ఈ దేశంలో యిన్ని కోట్లమంది బడిపంతుళ్ళభార్యలు విడాకులివ్వకుండా ఇన్నాళ్ళు ఎలా కాపురాలు చేస్తున్నారంటావ్ ?'

'ఎందుకులే అన్నయ్యా లేనిపోని కబుర్లు: ఏవీ లేని ఆ కొంపలో నన్ను పడేసి నీ బరువేదో నువ్వు దింపుకుంటానంటే నాకేం అభ్యంతరంలేదు. కాస్త మంచి సంబంధం వస్తే కట్నం యిచ్చుకోవాలనేగా నీ బెంగ ! ఎందుకూ నీ భేదబుద్ధి స్పష్టంగా కనబడుతూనే ఉంది. నీకంత యిష్ట మయితే ఆ ఎకరం భూమి చెల్లిపెళ్ళికే అమ్ముదువుగాన్లే !' రామచంద్రం నిర్ఘాంతపోయాడు. ఆ సంగతి చిన్నమ్మలుతో చెబితే అది అంటుందీ :

'బాగుంది. అదింకా అమాయకురాలు కాబట్టి అలా దేవుళ్ళాడుతోంది. ఏవఁయినా నువ్వు మొగాడివి ... నాన్న యిచ్చిన ఆస్తి నీది. అది నువ్వేలా చేస్తే అడిగే దెవరు? ఆడకూతుళ్ళం, మధ్యని మే మెలాపోతే ఎవరికేం కావాలి ?'

పోనీ చిన్నవాళ్ళని సరిపెట్టుకుందామా అంటే యిదిగో యితింత లేసి మాటలు: ఇలాంటివి ఎన్నాళ్ళని భరించడం ?

వీళ్ళని ఎలాగా బాగుచెయ్యలేను, నేను మాత్రం ఎందుకు చెడిపోవాలి? అన్న ప్రశ్న ఒకనాడు రామచంద్రంలో ఉదయించింది.

'ఎదిగిన ఆడపిల్లల్ని విడిచి వెళ్ళిపోడం ఎంత తప్పు !' అని మొదట తన ఆలోచనల్ని తనే తిట్టుకున్నాడు. కాని ఈ ప్రశ్న తననిమాత్రం విడిచిపెట్టలేదు. 'అవును, తప్పేముంది ?' అనుకోసాగేడు.

భగవంతుడు కల్పించిన పరిస్థితుల్ని యథాతథంగా స్వీకరించి సహనంతో యీ అయిదేళ్లూ గడిపేడు. ఈ అయిదేళ్ళలోనూ తను

శోధించిం దేమిటి ? సాధించిం దేమిటి ? అయినా యిలా ఎన్నాళ్ళు ? ఎన్నేళ్ళు ? ఏమోగాని అతని మనసుకి పూర్తి నిబ్బరం కలగలేదు.

అందమైన బొమ్మలున్న పత్రికల్ని చూడ్డం, అదే పనిగా షికార్లకి వెళ్ళడం, అస్తమానం అలంకరించుకోడం...అంతకన్న తన చెల్లెళ్ళకు ఏం చేతనవును ? తను లేకపోతే వాళ్ళ జీవిత మేవవును ? ఇంతకీ ఆ పనులన్నీ ఆ వయసు ఆడపిల్లలకి సహజమైనవే గాని క్షమించరాని అపరాధం కాదే ! తల్లిదండ్రులకి తను తీర్చవలసిన ఋణం యిలాకాదే !

మంచి చెడ్డల, వెలుగు నీడల మధ్య ఉయ్యాల లూగుతున్న అతని మనసు ఆ ముందురోజు బావదగ్గిర్నుంచి వచ్చిన ఉత్తరంతో ఒక నిశ్చయానికి వచ్చేసింది.

'రామచంద్రం.'

నీకున్న బాధ్యలతోబాటు యీ భారమూ నీమీద పెట్టక తప్పనందుకు విచారిస్తున్నాను.

ఏం చెయ్యను? మీ అక్కయ్యకు యీ మధ్య మళ్ళీ పిచ్చి తిరగబెట్టింది. డాక్టరుకి చూపిస్తే యిక యిది కుదిరేది కాదని తేల్చేశాడు. నేను ఇవతల ఆఫీసు పనులు చూసుకుంటూ అవతల మీ అక్కయ్యనూ, పిల్లల్నీ ఎలా సవరించుకొనేది చెప్పు ?

రేపు మెయిల్లో గుమాస్తా నిచ్చి మన యింటికి పంపేస్తున్నాను.

నన్ను క్షమించు.

—సూర్యనారాయణమూర్తి.

* * * *

రైలు ఏదో స్టేషనులో ఆగి మళ్ళీ బయలుదేరింది. చిరుచీకటి పడుతోంది. రామచంద్రం తుళ్ళి పడ్డాడు.

సరిగా అదే వేళకు తన అక్కయ్య-పిచ్చెత్తి, యిక డాక్టరు కుదరదని స్పష్టంగా చెప్పేసిన అక్కయ్య — ఒకరు, యిద్దరుకాదు అయిదుగురు పిల్లలతో...దిక్కుమాలిన యిద్దరు చెల్లెళ్ల పంచన చేరుతుంది: అతని మనస్సు వికలమైపోయింది. 'వీళ్ల గతి ఏంకాను?'

'గంగలో దిగనీ...ఈ ప్రపంచంలో దిక్కులేని వాళ్లందరికీ ఏ సహాయం లభిస్తోందో అదే వీళ్లకు లభించనీ...అంతేగాని వీళ్లతోపాటు నేను కూడా ఏంకాను ?'

ఒక్కనాడు తన మట్టుకు తను హాయిగా సినిమాకు వెళ్లిందిలేదు. స్వేచ్ఛగా ఒక్క సిగరెట్టు కాల్చుకున్నదిలేదు...ఎన్నాళ్ళీ చెర ? పాతికేళ్లయినా నిండని తనకి ఏ తలనెరిసినవాడికీ లేనన్ని యిన్ని సమస్యలు ఎందుకుండాలి ?

'భగవంతుడా, ఎందుకింత అన్యాయం చేశావు ?'

రామచంద్రం ఎంత సరిపెట్టుకుందామన్నా హృదయ విదారకమైన ఈ భావం నిలువెల్లా కదిల్చి అతనికి కన్నీటిని తెప్పించక మానలేదు. రైల్లో తన్నెవరేనా చూస్తున్నారేమో అని అతను చుట్టూ చూడసాగేడు. అప్పటికే అందరూ కునికిపాట్లు పడుతున్నారు. ఓ ముసలాయన కాబోలు ఏదో తత్వం పాడుకుంటున్నాడు. 'నీదు మహిమ పొగడ నా తరమా ? రామ, నిత్య సుఖధామ' మానస సరోవరంలోని మాయాహంసల్ని సైతం మైమరపించి సై అనిపించే హంసానందిని రాగంలోని ఆ సంకీర్తన క్షణకాలం రామచంద్రం మనసుకి ఊరట కలిగించింది. వెంటనే అతనికి తీవ్రమయిన కోపంకూడా కలిగింది.

'మీరేమీ అనుకోకపోతే ఒక టడుగుతాను తాతగారూ !'

'అడుగుబాబూ, దానికేం ?' అన్నాడాయన.

'మీ స్థితి చూస్తే ఈ వయసులోకూడా మీరు చాలా బాధపడుతున్నట్టు తెలుస్తోంది. చివరి కాలంలోకూడా భగవంతుడు మీకు అన్యాయం చేసినట్టుంది. మరి మీరు భగవంతుణ్ణి ఏవిధంగా పొగడ గలుగుతున్నారు. ఇది ఆత్మవంచన కాదా ?'

తాత కోపం తెచ్చుకోడంపోయి రామచంద్రం వంక ప్రేమతో చూశాడు. 'బాబూ ! ఏదో బాగా బాధపడి అడిగినట్టున్నావు. కాని నీలాంటి వాడు అడగవలసిన ప్రశ్న కాదిది. నేనూ కొన్ని బాధలు పడ్డమాట నిజమే. కాని యీ చివరికాలంలో, యింత వయసులోకూడా భగవంతుడు నా కింకా వినికిడిశక్తీ, కంటి వెలుగూ యిచ్చాడు. కృతజ్ఞత తెలుపుకోడం తప్పంటావా బాబూ ?'

రామచంద్రం సీటు దిగివచ్చి తాత పక్కని కూచున్నాడు.

'బరువైన బాధ్యత నెత్తిన వేసుకోందే సుఖపడే హక్కు మనకిలేదు బాబూ ... తలలో నాలికలా నాతో ఏభైఏళ్ళు కాపురం చేసిన నా అమ్మిపోయి మనసు పాడైపోయినప్పుడు ఏంచేశాను? ఈ పాటే పాడుకున్నాను. నాకు ఒకర్తె కూతురు. దాన్ది మా అమ్మ పేరు. అమ్మదగ్గిరకు వెళ్ళినంత ఆప్యాయంగా వెడితే ఈ ముసలాడ్ని అల్లుడి కంటె అమ్మాయే ముందు గెంటేస్తే ఏంచేశాను! ఈపాటే పాడుకున్నాను.'

'సొంతకూతురు మిమ్మల్ని తగిలేసిందా ? ఎంతన్యాయం !

'తప్పేముంది బాబూ ! ఎవరి సుఖం వాళ్ళు చూసుకుంటే మిగిలినవాళ్లు ఏమైపోతే వాళ్ళకేం ?'

నేరంచేసి పట్టుబడిపోయిన వాడిలా రామచంద్రం నిలువెల్లా వణికిపోయాడు.

'తామస గుణానికి వయసుతో పనేముంది ? మొదట నాకూ చాలా కోపమొచ్చి వెళ్ళిపోదా మనుకున్నాను. కాని స్వస్థలం విడిచిపెట్టొచ్చు.

స్వభావాన్ని విడిచి పెట్టలేంగా! బ్రతుకు మరింత మధురం చేసుకోవాలనుకోవచ్చు. బాధ్యతలను కాదనలేంగా! మా అమ్మాయే నన్ను గుమ్మంలోంచి వెళ్ళిపొమ్మందంటే ఆ తప్పు నాదే అని తెలుసుకున్నాను. ఆ యింటి పూచీ నేనే మరింత పైనవేసుకున్నాను. దానితో వాళ్లే నన్ను వదలలేని స్థితికి తెచ్చుకున్నాను. అంతకన్న నా కానంద మేముంది ?'

'ఈ విషయంలో మీరేం చెయ్యగలిగేరు ?'

'అనుకోడంలో ఉందిగాని మనసుకి వయసుందా బాబూ ? నేనేం చెయ్యలేనని ? నాకేం లోటని ! ప్రొద్దునలేస్తే మనం ఎంత మంది వికలాంగుల్ని చూడ్డంలేదు? వీళ్లందరికన్న మనం నయంకాదా? అదివ్వలేదు, యిదివ్వలేదని ప్రతిక్షణం భగవంతుణ్ణి నిందించడం తప్ప సర్వాంగ సంపూర్ణమైన శరీరం యిచ్చాడనే కృతజ్ఞతా భావం ఎంతమంది కుంది ? ఒక వెయ్యి రూపాయలు ఎవరేనా యిస్తామంటే చిటికెనవ్రేలు కోసి యివ్వగలమా ? ఇంత విలువైన శరీరం కంటె భగవంతుడిచ్చే మహత్తరమైన కానుక యింకేముంది బాబూ ?'

ఇక రామచంద్రం ఆగలేకపోయాడు.

కన్నీళ్లతో తన కష్టగాథను ఆయన ముందు వెళ్లగ్రక్కేదాకా ఉండలేకపోయాడు.

'అందమైన మీ ఆధ్యాత్మిక పరిశీలనే సమస్యతో సతమతమౌతున్న నా జీవితానికి సరియైన జవాబు నిచ్చింది. నా గమ్యస్థానాన్ని రమ్యస్థానంగా మార్చింది. వ్యర్థమయ్యే నా వ్యధని అర్థమున్న కథగా మార్చింది. ఇక ఒక్కటే కోరిక. మీరు యిక్కడే కూచోండి. ఆ తలుపు తీసెయ్యండి. మీ ఒళ్ళో పడుకుని వెన్నెలపడి ప్రతిఫలించి మెరిసే మీ బొక్కి పళ్ళు చూస్తూ ఆ చక్కని పాట మరొక్కమారు, మళ్లీ ఒక్కమారు...వినాలనుంది !'

పువ్వులతోటలోని పుష్ప సుగంధాన్ని చూడలేనివారు కాగితపు పువ్వులతో గదిని అలంకరించుకోవచ్చు. మనఃఫలకంమీద మధుర దృశ్యాలను చిత్రించుకోలేనివారు ఫోటోలతో యింటిగోడల్ని నింపుకోవచ్చు. కాని, తిరుగు రైల్లో యింటికి వచ్చేస్తూ, కష్టాల తాకిడికి పదునెక్కిన మనసుగల రామచంద్రం వంటి వాళ్ళకు తలచుకుంటే సాక్షాత్కారం కాని దృశ్యమేముంది ?

'మేనల్లుళ్ళూ, మేనగోడళ్ళూ కాళ్ళా చేతులా పడుతున్న దోసతోట లాంటి పెళ్ళివారిల్లు అది.

మట్టెలూ పారణీ ఉన్నకాళ్ళు 'నిన్ను వదలలేంరా అన్నయ్యా' అంటున్నాయి. కాటుకా కన్నీళ్లు 'నిన్ను మరవలేంరా అన్నయ్యా' అంటున్నాయి. పకపక నవ్వు వినబడింది. అది అక్కయ్య నవ్వు.

విచారంతో పిచ్చెక్కిన నవ్వుకాదది. మానవతతో మత్తెక్కిన నవ్వది.

వీళ్ళందరి వెనుకా చెయ్యెత్తి దీవిస్తున్న ముడతలుపడ్డ చెయ్యి ఒకటుంది. అది ఎవరిది మరి ?

రామచంద్రం తడసిన చెంపల్ని చేత్తో అద్దుకున్నాడు. ఆ చేతుల్ని కళ్ళ కద్దుకున్నాడు.

అవును. అదే అద్దం...అదే అర్థం...అదే అందం !